
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
గురువారం 25 జూలై 2024





బనవాసి బోసిపోయింది..!



వారం రోజులుగా ఫారెస్టు భూములను చదును చేసుకుంటున్న ఆక్రమణదారులు

ఎమ్మిగనూరు, జూలై 24:
ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఫారం అటవీ భూములు ఆక్రమణకు గురువుతున్నాయి. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో సమీప గ్రామాలకు చెందిన కొంతమంది ఫారెస్టు భూములను ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. బనవాసి ఫారంలో ఉన్న జెర్సి పశుక్షేత్రం పరిధిలో దాదాపు మూడు వేల ఎకరాల భూమి ఉంది. అయితే పశు క్షేత్రం నిర్వహణను పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో అది కాస్త నిలిచిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో ప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయం, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, కేవీకే, వెటర్నరీ కళాశాల, గొర్రెలు, మేకల పరిశోధానా క్షేత్రం వంటివి ఏర్పాటు చేశారు. దీంతో మూడు వేలు ఉన్న భూమి కాస్త ప్రస్తుతం దాదాపు 1500 నుంచి రెండు వేల వరకు మిగిలింది. ఈ భూములను సైతం కొంతమంది ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. ప్రధానంగా రాగిమాన్ దొడ్డి, వెంకటగిరి, నక్కల మిట్ట గ్రామల సమీపంలో బనవాసి, మల్కాపురం, రాగిమాన్‌దొడ్డి, వెంకటగిరి గ్రామాలకు చెందిన కొంతమంది పదుల ఎకరాల్లో భూమిని చదును చేసుకొని వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. అలాగే ఫారెస్టు భూములను ఆనుకొని ఉన్న పొలాలకు చెందిన వారు సైతం అడిగే వారు ఎవరూ లేరని అప్పుడింత, ఇప్పుడు ఇంత తమ పొలంలోకి కలుపుకుంటున్నారు.

ఆక్రమణలో 33.9 ఎకరాల భూమి

బనవాసి ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రం పరిధిలో ఉన్న భూమిలో దాదాపు 33.9 ఎకరాలను ఆయా గ్రామాలకు చెందిన వారు ఆక్రమించుకున్నారు. బనవాసి ఫారం అటవీ భూముల సమీపంలో ఉన్న గ్రామాలైన బనవాసి, పరమాన్‌దొడ్డి, వెంకటగిరి, బోడబండ, చెన్నాపురం గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు తమ పొలాల పక్కనే ఉన్న ఫారెస్ట్ భూమిని 8.4 ఎకరాలు హద్దులు మార్చి తమ పొలాల్లోకి కలిపేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే నక్కలమిట్ట గ్రామ సమీపంలో సైతం ఆరు ఎకరాల భూమిని మల్కాపురానికి చెందిన కొంతమంది ఆక్రమించుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. అలాగే రాగిమాన్‌దొడ్డి గరుసు తిప్ప సమీపంలో ఉన్న అటవీ భూముల్లో సైతం పరమాన్‌దొడ్డి, బనవాసి, మల్కాపురం గ్రామాలకు చెందిన 39మంది 19.5 ఎకరాల భూమిని ఆక్రమించుకొని పత్తి, మిరపతో పాటు వివిధ రకాల పంటలను సాగు చేసుకున్నారు.



బనవాసి ఫారెస్టు భూముల్లో అనుమతులు లేకుండా సాగు చేసిన పంటలు



బనవాసి ఫారంలో ఉన్న ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రం

రాజకీయ పార్టీల అండదండలతోనే..

గతంలో అధికారంలో ఉన్న కొంతమంది రాజకీయ నాయకులు తమ అధికారాన్ని చాటుకునేందుకు భూ ఆక్రమణ దారులకు వంతపాడుతూ వచ్చారు. అంతేగాక తమ అవసరాల కోసం నాయకులను ఆశ్రయించిన వారికి తమదే భూమి అన్నట్లుగా అటవీ భూముల్లోని పలాన ప్రాంతంలో సాగు చేసుకోండంటూ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతోనే సమీప గ్రామాలకు చెందిన కొంతమంది ఏకంగా అర ఎకరా నుంచి ఎకరాల వరకు ఆక్రమించి గత నాలుగైదేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఎవరైనా అధికారులు భూములు ఖాళీ చేయాలని సంబంధిత ఆక్రమణదారులపై ఒత్తిడి తెస్తే వారిపై తమ అధికార బలంతో వెనక్కి పంపుతూ వచ్చారు. ఈ క్రమంలోనే ఈ ఆక్రమణలు నేటికీ కొనసాగుతున్నాయి.

ఆక్రమణలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

ఆక్రమణలపై స్థానిక అధికారులు పరిశీలించి ఒక నివేదిక తయారు చేసి ఆగస్టు 2021లోనే రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఆక్రమణలపై ఉన్నతాధికారులు గాని, స్థానిక అధికారులు కాని ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. స్థానిక అధికారులు ఒకట్రెండు సార్లు ఆక్రమణలను పరిశీలించి ఖాళీ చేయాలని చెప్పినప్పటికీ ఆక్రమణదారులు ఏ మాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛగా సాగు చేసుకుంటున్నారు. అంతేగాక కొంత మంది ఆక్రమణదారులు భూములను ఏకంగా ఇతరులకు కౌలుకు ఇచ్చుకొని సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆక్రమణకు గురవుతున్న అటవీ భూములు
- శివారు భూముల్లో అక్రమంగా సాగు
- ఫిర్యాదులతోనే సరిపెట్టుకుంటున్న అధికారులు

పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

బనవాసి అటవీ క్షేత్రం భూముల తాజా ఆక్రమణలపై ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రం అధికారులు సోమవారం ఎమ్మిగనూరు రూరల్ పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. భూముల ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.

ఫారెస్టు భూముల ఆక్రమణలపై ఎమ్మెల్యే ఆరా..

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఈనెల 18వ తేదీన ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల ఆక్రమణ విషయం తెలుసుకున్న ఆయన స్థానిక డీడీ శ్రీధర్‌రావును వివరణ అడిగారు. ఇందుకు స్పందించిన డీడీ ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, వెంటనే ఆక్రమణ దారుల నుంచి భూములను తీసుకునేందుకు చర్యలు చేపడతామన్నారు.


తాజాగా భూముల ఆక్రమణకు యత్నం

ఇప్పటికే పదుల సంఖ్యలో బనవాసి అటవీభూమి ఆక్రమణలకు గురైంది. ఇదిచాలదన్నట్లు తాజాగా వారం రోజుల క్రితం బనవాసికి చెందిన కొంతమంది తామేమీ తక్కువ అన్నట్లుగా వ్యవహరిస్తూ భూములు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. గ్రామానికి చెందిన కొంతమంది బనవాసి రహదారి పక్కలో ఎల్లెల్సీ సమీపంలో ఉన్న భూముల్లో హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకొని ఆక్రమణదారులను అడ్డుకున్నారు. అయితే ఆక్రమణకు యత్నించిన వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎంతో మంది ఎకరాలకు ఎకరాలు ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నారని.. వారినైతే ఏమి అనకుండా తమ జోలి ఎందుకు వస్తున్నారంటూ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఆక్రమణకు యత్నించిన వారితో మాట్లాడారు. అటవీ భూములను ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీంతో వారు అక్కడిని నుంచి వెళ్లిపోయారు. కాగా వారం రోజులుగా రాత్రికి రాత్రే కొంత మంది బనవాసికి వెళ్లే రహదారి పక్కన ఎల్లెల్సీ సమీపంలో ఉన్న అటవీ భూముల్లో అక్రమంగా సాగు చేసుకునేందుకు భూముల్లో ఉన్న చెట్లను, మొక్కలను తొలగించారు. అంతేగాక తొలగించిన ముళ్ల పొదలతో హద్దుగా ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

ఆక్రమణదారులను ఉపేక్షించేది లేదు

భూముల ఆక్రమణలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. కాగా మా కేంద్రం పరిధిలో ఉన్న భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. ఆక్రమణదారులను ఇప్పటికే గుర్తించాం. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. పరిశీలించి ఆక్రమించుకున్న భూముల్లో నుంచి ఆక్రమణదారులను ఖాళీ చేయిస్తాం. అలాగే కంచె ఏర్పాటు చేసి భూములను పరిరక్షిస్తాం.

-శ్రీధర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్, ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రం, బనవాసి



అనుమతులు లేకుండా సాగు చేసిన పంటలు

ప్రజల కోసం పోరాడుతాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: కష్టజీవుల పార్టీ అయిన సీపీఐ ఎన్నికల్లో ఓడినా..గెలిచినా తాము ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. 400 సీట్లలో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్న ప్రధానికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. దీంతో టీడీపీ, జేడీయూతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ పేదలను నిర్లక్ష్యం చేస్తోంద న్నారు. ఢిల్లీ, ఝార్ఖండ్ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, శిబూసోరెన్‌లను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. రాబోయే రోజుల్లో దేశాన్ని కాపాడేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయా లని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా ఈ సంవత్సరం డిసెంబరు 26 నుంచి 2025 డిసెంబరు 26 వరకు శతాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నబిరసూల్, రామకృష్ణారెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయండి

ఆదోనిలో పర్యటించిన కలెక్టర్ పి.రంజిత్ బాషా

ఆదోని, జూలై 24: వచ్చే విద్యా సంవత్సరంలోపు ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణాల పనులు పూర్తి కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సమీపంలో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో కలసి ఆయన పరిశీలించారు. మెడికల్ కళాశాల సమగ్ర స్వరూపం, నీటి సరఫరా, తదితర అంశాలను మ్యాప్ ద్వారా పరిశీలించి, వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కళాశాల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసరెడ్డి, ఆదోని తహసీల్దార్ హసీనా సుల్తానా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీఈవో శామ్యుల్, డీపీవో నాగరాజు నాయుడు తదితరులు ఉన్నారు.

●సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పీ రంజిత్ బాషా సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆదోని మండలం నాగలాపురం గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను గురించి కలెక్టర్ సిబ్బందితో ఆరా తీశారు. ఆదే విధంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్ ద్వారా వైద్య సేవలు అందుతున్న తీరు గురించి కూడా కలెక్టర్ సిబ్బందిని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.



మెడికల్ కాలేజీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

● పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని మండలం నాగలాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం అమలను పరిశీలించారు. అనంతరం భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యంగా, రుచిగా భోజనాన్ని అందజేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని ఆదేశించారు. అనంతరం నాగలాపురం గ్రామంలో శానిటేషన్, తాగు నీటి సరఫరా గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న కలెక్టర్

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

రూ.95 లక్షలు స్వాహా

కర్నూలు, జూలై 24: సీఈఓలుగా చెలామణి అవుతూ నిరుద్యోగులను మోసగించిన బోగస్ కంపెనీల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఏకంగా కొందరు రూ.95లక్షలు స్వాహా చేసిన ఘటనపై అనూష అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు... కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రిచ్‌మండ్ విలాస్‌లో నివాసం ఉంటున్న అనూష అనే మహిళ ఆన్‌లైన్‌లో జాబ్స్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఇది పసిగట్టిన ఏవీఎల్, డికవర్ కంపెనీ అనే సంస్థలు సమాచారాన్ని సేకరించాయి. ఈ కంపెనీకి చెందిన సీఈవోలమని చెప్పి సంతోష్ అనే వ్యక్తి అడ్రస్ కనుక్కుని ఆమె ఇంటికి వచ్చాడు. తమ కంపెనీలో జాబ్ ఇస్తామని హైదరాబాదులో ట్రైనింగ్ ఉంటుందని రూ.5 లక్షలు ముందుగా చెల్లించాలని, ఆ తర్వాత భారీ మొత్తంలో జీతాలు ఉంటాయని నమ్మించాడు. అతడి ద్వారా సురేష్, ధనలక్ష్మి, శ్యాంప్రసాద్ అనే మరో ముగ్గురు కూడా ప్రముఖ కంపెనీలకు చెందిన సీఈఓలు అని చెప్పి అనూష దగ్గర వచ్చారు. దీంతో అనూష తనకు తెలిసిన 18 మందిని వారికి పరిచయం చేసింది. వీరంతా ఈ కంపెనీ ప్రతినిధులకు రూ.5లక్షల చొప్పున చెల్లించారు. ఆ తర్వాత వీరందరినీ హైదరాబాదుకు తీసుకెళ్లి ఇదే తమ సంస్థ అని చెప్పి నమ్మించారు. కర్నూలులోని ఇళ్లవద్దే ఉంటూ ట్రైనింగ్ కోర్సు, తర్వాత జాబ్స్ ఉంటాయనీ తెలిపారు. దీంతో కర్నూలు వచ్చిన వారికి కొన్ని రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత మరోసారి హైదరాబాదుకు వెళ్తే ఆ సంస్థ దగ్గర వందలాది మంది బాధితులు తాము కూడా మోసపోయామని తెలిపారు. దీంతో 19 మంది కర్నూలుకు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్పీ

ఆలూరు, జూలై 24: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని ఎస్పీ బిందు మాధవ్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి ఆలూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దులో అక్రమ మద్యం, ఇసుక రవాణా అడ్డుకట్ట వేస్తామని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా కొందరు ఎటువంటి గుర్తింపు లేకపోయినప్పటికీ విలేకరుల పేరుతో చెలామణి అవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆలూరు జర్నలిస్టులు ఎస్పీని కోరారు. ఇందుకు స్పందించిన ఎస్పీ అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులు మాత్రమే వాహనాలకు ప్రెస్ స్టిక్కర్లు కలిగి ఉండాలన్నారు. వీటిపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేసు తదితరులు ఉన్నారు.



ఆలూరు పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ బిందుమాధవ్

శ్రీశైలానికి భారీగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, జూలై 24: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి బుధవారం భారీగా వరద ప్రవాహం కొనసాగింది. జూరాల జలాశయం నుంచి 1,75,448 క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,76,980 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 849.80 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత నీటి నిల్వ 79.6340 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడంలేదు.

కర్నూలులో నిర్మాణంలో జీజీహెచ్ పనులు





కేశవా.. కరుణించవా..

నేడు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తొలి బడ్జెట్

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టే తొలి బడ్జెట్ ఇది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయినా.. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన సాగు నీటి ప్రాజెక్టులు పట్టాలెక్కాలంటే కనీస రూ.వెయ్యి కోట్ల నిధులైనా కేటాయించాలని సాగునీటి నిపుణులు కోరుతున్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాజెక్టుల పర్యవేక్షణలో, నీటి పంపకాల్లో ఇబ్బందులు తొలగాలంటే కీలకమైన కృష్ణా బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలి. కర్నూలు, ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణాలు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వాలి. జగనన్న కాలనీల్లో పేదల ఇళ్లు పూర్తి చేసేందుకు, టిడ్కో ఇళ్లు పంపిణీ చేసేందుకు సంపూర్ణ సహకారం అందించాలి. ఇవి చేస్తేనే కర్నూలును అభివృద్ధి చేసినట్లవుతుంది. ప్రజల సమస్యలు పరిష్కరించినట్లవుతుంది. గురువారం బడ్జెట్ ఎలా ఉంటుందో చూడాలి.



- ఉమ్మడి జిల్లాలో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు
- గత జగన్ ప్రభుత్వంలో నీటి వనరులపై నిర్లక్ష్యం
- కనీసం రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలంటున్న ఇంజనీర్లు
- కర్నూలు, ఆదోని మెడికల్ కాలేజీల పూర్తికి సహకరించాలి
- కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటుకు చొరవ చూపాలి
- కర్నూలు కరువు రైతుల ఆశలు

కర్నూలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత అత్యంత వెనుకబడి జిల్లాగా కర్నూలు మిగిలింది. కేవలం 4.5 టీఎంసీలు సామర్థ్యం కలిగిన గాజులదిన్నె ప్రాజెక్టు మినహా ఒక్క ప్రాజెక్టు లేదు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల జలాశయం వంటి ప్రాజెక్టులను మంజూరు చేశారు. రాయలసీమ జీవనాడి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, అవుకు బైపాస్ టన్నెల్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పూర్తి చేశారు. నీరు-చెట్టు కింద వివిధ సాగునీటి వనరులు, కాలువలు, చెరువుల్లో పూడికతీత, మరమ్మతులు చేపట్టారు. 2019 మేలో సీఎం జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఐదేళ్ల జిల్లా సాగు నీటి ప్రాజెక్టులపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించారు. జిల్లాకు చెందిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల ఆర్థిక శాఖ మంత్రిగా కొనసాగినా.. నిధులు కేటాయింపులో తీరని అన్యాయమే జరిగింది. ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే పడకేశాయి. కనీసం గేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఘోరంగా ఓడించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి పట్టం కట్టారు. కర్నూలు, నంద్యాల ఎంపీలతో పాటు 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించి 1999 రికార్డును తిరగ రాశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై కరువు రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి కలలు సాకారం అయ్యేలా బడ్జెట్ కేటాయింపులు చేసి అటకెక్కిన ప్రాజెక్టులకు జీవం పోయాలని, గురువారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అంకెల కూర్పులో కరువు జిల్లాకు సముచిత స్థానం కల్పించాలని సాగు నీటి నిపుణులు కోరుతున్నారు.

కృష్ణా బోర్డు.. గుండ్రేవులపై స్పష్టమైన ప్రకటన చేయాలి

రాష్ట్ర పునర్విభజన తరువాత కృష్ణా, గోదావరి జలాల పంపకాల్లో ఏ తేడాలు రాకుండా ఉండేందుకు కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు ఏర్పాటు చేశారు. కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఏపీలో ఏర్పాటు చేయాలని ఏపీ విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ఈ బోర్డు ప్రధాన కార్యాలయం పదేళ్లుగా హైదరాబాదులోనే ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం కృష్ణా బేసిన్‌కు ఏమాత్రం సంబంధం లేని విశాఖపట్నంలో ఏర్పాటు చేసింది. అయితే.. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా నదిపై నిర్మించిన వివిధ ప్రాజెక్టులు ముప్పాతిక శాఖ కర్నూలు నగరానికి దగ్గరగా ఉన్నాయి. శ్రీశైలం ఎగువన రెండు రాష్ట్రాలు పలు వరద నీటి ఆధారంగా ప్రాజెక్టులు నిర్మించారు. ఈ ప్రాజెక్టులు సహా శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల.. వంటి ప్రాజెక్టుల పర్యవేక్షణ, నీటి కేటాయింపులు, నీటి సమస్యల పరిష్కారానికి కర్నూలు నగరం ఎంతో అనువైనది సాగునీటి నిపుణులు అంటున్నారు. కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటు చేసేలా ఈ సమావేశాల్లో కీలక నిర్ణయం తీసుకోవాలి.

- తుంగభద్ర నదిపై రెండు తెలు గు రాష్ట్రాలకు ఉపయోగకరంగా 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు 2019 ఫిబ్రవరి 21న ఆనాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు మంజూరు చేస్తూ జీవో నంబరు.153 జారీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇంటర్ స్టేట్ సమస్య అనే ముద్ర వేసి కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టేశారు. ఈ బడ్జెట్‌లోనైనా ఆ ప్రాజెక్టుకు మోక్షం కల్పించాలి.
- కర్నూలు, ఆదోనిలో మెడికల్ కళాశాల నిర్మాణాలు చేపట్టారు. వివిధ దశల్లో ఉన్నాయి.నిధులు ఇచ్చి నిర్మాణం వేగం పెంచాలి. అదే క్రమంలో రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా రూ.160 కోట్లతో కర్నూలు సర్వజన వైద్యశాల ఆవరణలో నిర్మాణం చేపట్టిన స్టేట్ క్యాన్సర్ యూనిట్ భవనం మాత్రమే పూర్తయింది. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన ఆధునిక యంత్రాలు తక్షణమే సమకూర్చాలి.
- ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరులో 21,300 టీడ్కో ఇళ్ల పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. అలాగే.. కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట 37,550 ఇళ్లు చేపట్టి 17,071, నంద్యాల జిల్లాలో 46,734 ఇళ్లు చేపట్టి 26,414 ఇళ్లు కూడా పూర్తి చేయలేని పరిస్థితి ఉంది. వీటిపై దృష్టి పెట్టాలి. అదే క్రమంలో జగనన్న కాలనీల పేరిట జరిగిన భూ సేకరణలో జరిగిన అవినీతిని వెలికితీయాలి.

కనీసం రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో శ్రీశైలం, కేసీ కాలువ, సుంకేసుల జలాశయం, ఎస్ఆర్‌బీసీ, గాలేరు-నగరి ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాలజుదిన్నె ప్రాజెక్టు, తెలుగుగంగ కాలువ, గురురామవేంద్ర ఎత్తిపోతల పథకం, సిద్ధాపురం లిఫ్ట్, ముచ్చుమర్రి, హంద్రీనీవా ప్రాజెక్టు.. వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి నిర్వహణతోపాటు గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకం గా చేపట్టి.. గత జగన్ ప్రభుత్వంలో పడకేసిన వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు పునఃప్రారంభం కావాలంటే నిధులు ఇవ్వాలి. నిర్వహణ, విద్యుత్ బిల్లుల కోసం రూ.2,500 కోట్లు కేటాయించాలని ఇంజనీర్లు అంటున్నారు. అయితే.. రాబోయే ఆరు నెలల కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు. ఆయా ప్రాజెక్టులు పనులు మొదలు పెట్టేందుకు కనీసం రూ.వెయ్యి కోట్లైనా ఇవ్వాలని కోరుతున్నారు. అయితే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు తక్షణ మరమ్మతులకు రూ.12.77 కోట్లు ఇవ్వాలని ఆ శాఖ కర్నూలు ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా ప్రభుత్వానికి నివేదిక పంపారు.

తక్షణ మరమ్మతులకు అవసరమైన నిధులు రూ.కోట్లలో

ప్రాజెక్టు	పనులు	నిధులు
టీబీపీ ఎల్లెల్సీ, ఆదోని డివిజన్	28	4.30
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	7	1.29
కేసీ కెనాల్, నంద్యాల డివిజన్	34	3.10
మైనర్ ఇరిగేషన్, కర్నూలు	37	3.02
మైనర్ ఇరిగేషన్, నంద్యాల	40	1.06
మొత్తం	146	12.77

ముగిసిన నామినేషన్ల పర్వం

స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 15 మంది

పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల నుంచి ఇద్దరు సభ్యుల ఖరారు?



ఇన్‌చార్జి కమిషనర్‌కు నామినేషన్ ఇస్తున్న టీడీపీ కార్పొరేటర్ విజయకుమారి

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: నగర పాలక సంస్థ పరిధిలోని స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల పర్వం బుధవారం ముగిసింది. చివరి రోజు నగర పాలక కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ పివి. రామలింగేశ్వర్‌కు ముగ్గురు కార్పొరేటర్లు నామినేషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, సీ3 క్లర్క్ శ్రీకాంత్ ఉన్నారు.

- **బరిలో 15 మంది కార్పొరేటర్లు:** ఐదుగురు కమిటీ సభ్యులకుగాను 15 మంది బరిలో ఉన్నారు. ఇప్పటికే పాణ్యం, కోడుమూరు నియోజకవర్గం నుంచి ఇద్దరు సభ్యులను ఖరారు చేసుకున్నారు. పాణ్యం నియోజకవర్గం నుంచి 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ నామినేషన్ దాఖలు చేసారు. అయితే పాణ్యం నుంచి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో కోడుమూరు నియోజకవర్గం నుంచి 40 వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డిని బలపరిచేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాణ్యం నియోజకవర్గం నుంచి ఇద్దరు సభ్యులు ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే స్టాండింగ్ చైర్మన్‌గా మేయర్ వ్యవహరిస్తారు. ఇందులో ఐదుగురు కమిటీ సభ్యులు ఉంటారు. వీరికి సంబంధించి గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం పాణ్యం నియోజకవర్గం నుండి ఇద్దరు, కర్నూలు నియోజకవర్గం నుండి ముగ్గురు ఉండాలి. ప్రస్తుతం కర్నూలు నియోజకవర్గం వైసీపీ-07, కర్నూలు నియోజకవర్గం టీడీపీ-04, పాణ్యం నియోజకవర్గం వైసీపీ-01, కోడుమూరు నియోజకవర్గం వైసీపీ-02 కర్నూలు నియోజకవర్గం ఇండిపెండెంట్ ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు.
- **కర్నూలు నియోజకవర్గంలో ఉత్కంఠ:** ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు 8 మంది కార్పొరేటర్లు వెళ్లిపోయారు. దీంతో ఈసారి ఎలాగైనా టీడీపీ నుంచి కమిటీలో స్థానం సంపాదించాలని ఐదుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా వైసీపీ నుంచి ఏడుగురు నామినేషన్ వేశారు. అయితే కర్నూలు నియోజకవర్గం టీడీపీ నుంచి ఎవ్వరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలో జిల్లా పార్టీ కార్యాలయంలో చర్చిస్తున్నారు. దీంతో పాటు వైసీపీ అధినాయకత్వం కూడ ఇదే పనిలో ఉంది. ఎవరిని పోటీలో ఉంచాలా...ఎవ్వరిని విత్‌డ్రా చేయించాలో వైసీపీ నాయకులకు అంతుపట్టడం లేదు. పోటాపోటీగా నామినేషన్ దాఖలు చేశారు. అంతే కాకుండా ప్రస్తుతం నాల్గవ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన మూడో స్టాండింగ్ కమిటీ సభ్యులకు నిరాశే మిగిలింది. ఎన్నికైన 8 నెలలకే సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడం...కేవలం మూడు మాత్రమే స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరగడంతో నిరాశ చెందారు. అయితే నాల్గవ స్టాండింగ్ కమిటీ సభ్యులకు మాత్రమే సంవత్సరపాటు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే చివరి స్టాండింగ్ కమిటీ సభ్యులకు కూడ 2026లో వచ్చే కార్పొరేషన్ ఎన్నికలతో కేవలం 8 నెలలు మాత్రమే ఉంటుంది.

సంతాన లేమికి ఐవీఎఫ్

● ఆలస్యంగా వివాహాలు, ఒబెసిటీ, ఒత్తిడి, వ్యసనాలే కారణం ● నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే

కర్నూలు(హాస్పిటల్), జూలై 24: ఇటీవల సంతాన లేమి ఒక ప్రధాన సమస్యగా మారింది. అందువల్ల కృత్రిమ పద్ధతుల్లో ఫలదీకరణ ప్రక్రియ నిర్వహించి బిడ్డకు జన్మనిచ్చే పద్ధతి ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. దీని గురించి అవగాహన కోసం ప్రతి ఏటా జూలై 25న వరల్డ్ ఐవీఎఫ్ దినంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో మొదటి ఐవీఎఫ్ బేబీ అయిన లూయిస్ బ్రౌన్ పుట్టిన రోజును వరల్డ్ ఐవీఎఫ్ డేగా జరుపుకుంటున్నారు. సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కొంటున్న జంటలకు ఫెర్టిలిటీ సాంకేతిక విషయాలపై అవగాహన కల్పించడం దీని ఉద్దేశం.

- **ఐవీఎఫ్ ఎప్పుడు అవసరం:** సంతానం కలగని వారందరికీ ఐవీఎఫ్ అవసరం లేదు. వైద్యం వల్ల సహజ పద్ధతుల్లో గర్భం ధరించేందుకు చికిత్స అందిస్తారు. సహజ సిద్ధంగా గర్భధారణ కలగడానికి అవకాశం లేకుండా ఉంటుందో వారికి మాత్రమే ప్రత్యామ్నాయంగా ఐవీఎఫ్ అవసరం. ఆడవారిలో ఫెలోఫియన్ నాళాలు మూసుకుపోయినప్పుడు అండకణాలు తక్కువగా ఉన్నప్పుడు అలాగే మగవారిలో స్పెర్మ్ నాణ్యత తక్కువగా ఉన్నప్పుడు వారి అవసరం అవుతుంది. గతంలో వేలాది మంది దంపతుల్లో ఒకటి, రెండు జంటల్లో మాత్రమే సంతానలేమి కనిపించేది. ప్రస్తుతం ఈ సమస్య ప్రతి వంద మంది దంపతుల్లో 8 జంటల్లో కనిపిస్తోంది.
- **వివాహాలు ఆలస్యం కావడం వల్ల:** మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు సంతాన లేమికి కొంత వరకు కారణాలు. జీవితంలో స్థిరపడిన తర్వాత పెళ్లిళ్ల చేసుకోవాలన్న ఉద్దేశంతో ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. ఇది సంతానలేమికి ప్రధాన కారణం. 30 ఏళ్ల దాటాక వివాహాలు చేసుకోవడంతో యువతీ యువకుల్లో ఈ సమస్య తలెత్తుతోంది.

● రెండేళ్లలోపు గర్భం రావాలి..

సంతానలేమితో బాధపడుతున్న దంపతుల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. లేట్ మ్యారేజెస్, ఊబకాయం, ఒత్తిడితో కూడిన జీవన విధానం, ఆల్కహాల్, స్మోకింగ్ అలవాట్లు సంతానలేమికి కారణలుగా చెప్పవచ్చు. వివాహమై రెండేళ్ల దాటుతున్నా గర్భం రాకపోతే ఏదో సమస్య ఉన్నట్లే. సంతానలేమికి అత్యాధునిక ఐవీఎఫ్ పద్ధతులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

\- డా.పి. విష్ణుప్రియ, ఫెర్టిలిటీ స్పెషలిస్టు



పత్తికొండలో డెంగీ కేసు నమోదు

పత్తికొండ, జూలై 24: పత్తికొండ పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో డెంగీ కేసు నమోదైంది. కాలనీకి చెందిన మహాలక్ష్మికి రక్తపరీక్షల్లో డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకుంది. వైద్య సిబ్బంది డెంగీగా నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.

యువ రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, జులై 24: పోతుగల్లు గ్రామానికి చెందిన యువరైతు చక్రవర్తి ఆచారి(26) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయంలో అప్పులపాలు కావడంతో మంగళవారం రాత్రి గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య ఉంది. తండ్రి రమణయ్య ఆచారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

ట్రేడింగ్‌లో లాభం వచ్చిందని మోసం

కర్నూలు, జూలై 24: ట్రేడింగ్‌లో లాభం వచ్చిందని, ఆ డబ్బులు తీసుకోవాలంటే 20 శాతం కమిషన్ చెల్లించాలని చెప్పడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. డాక్టర్స్ కాలనీకి చెందిన సాయిరాం అనే వ్యక్తి అమిత్‌షా అనే వ్యక్తికి చెందిన ఓ వాట్సాప్ గ్రూపులో ఆన్‌లైన్ ట్రేడింగ్ కోర్సులో జాయిన్ అయ్యాడు. కోర్సులో భాగంగా సాయిరాంకు చెందిన ఆధార్, పాన్ కార్డులను తీసుకుని అకౌంట్ ఓపెన్ చేశారు. ఈ కోర్సు ద్వారా ట్రేడింగ్ అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.8.40 లక్షలు డిపాజిట్ చేయించారు. తర్వాత అదే అకౌంటులో రూ.81.19 లక్షలు లాభం వచ్చిందంటూ జమ చేశామని, ఆ నగదు విత్‌డ్రా చేసుకోవలంటే 20 శాతం కమిషన్ చెల్లించాలంటూ సూచించారు. బాధితునికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

సీఎం చొరవతోనే రాష్ట్రానికి ఆశించిన బడ్జెట్

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్, జూలై 24: సీఎం చంద్రబాబు చొరవతోనే రాష్ట్రానికి బడ్జెట్‌లో సముచిత స్థానం లభించిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధ వారం డోన్ పట్టణంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబు రెండు సార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారని తెలిపా రు. సీఎం చంద్రబాబు ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపి బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్తి చేసేందుకు కేంద్రం బాధ్యత తీసుకుందని, రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్ నిధులు కేటాయించడం వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామిక కారి డార్ అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. కేంద్రం ప్రకటించిన వరాలు రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, చంద్రబాబు కృషితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

శ్రావణ మాసోత్సవాలు జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కౌతాళం, జూలై 24: ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు రెండు వరకు నెల రోజుల పాటు జరగనున్న ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జయప్రదం చేద్దామని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. ఉరుకుంద దేవస్థానపు కాలక్షేపపు మండపంలో బుధవారం ఉత్సవాలపై అన్ని శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం పాలక మండలి అధ్యక్షుడు నాగరాజు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు. రోడ్లను మరమ్మతులు చేయాలని, కండీషన్ ఉన్న బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. అట్లాగే తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ వెంకటేష్, తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త కోసిగి సీఐ ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనకదుర్గ గోల్డ్ లోన్స్ నూతన శాఖలు ప్రారంభం



నంద్యాలలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జీఎం

నంద్యాల టౌన్, జూలై 24: ఫైనాన్స్ రంగంలో గత 41 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్, కనకదుర్గ గోల్డ్ లోన్స్ సంస్థలు నంద్యాలతోపాటు నందికొట్కూరులో తమ నూతన శాఖలను బుధవారం ప్రారంభించాయి. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి రోడ్‌తో పాటు నందికొట్కూరు పట్టణంలో నూతన బ్రాంచ్‌లను ప్రారంభించినట్లు జీఎం జె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు ఆర్‌బీఐ గుర్తింపు ఉందని, తమ సంస్థ ద్వారా రూ.5 వేలు నుంచి రూ.50 లక్షల వరకు అతి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. బంగారంపై ప్రతి గ్రాముకు అత్యధికంగా ఫైనాన్స్ లభిస్తుందన్నారు. అలాగే వ్యాపార, వ్యక్తిగత రుణ సౌకర్యానికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎం గురునాథ్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వి.రాజు, ముఖ్య అతిథులు టి.నరసింహారెడ్డి, బి.నరేంద్ర రెడ్డి, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో తాగు నీటిలో పురుగుల మందు

కేసు నమోదు చేసుకున్న పోలీసులు



పురుగుల మందు నీళ్లను చూపుతున్న మద్దమ్మ కుటుంబ సభ్యులు

సి. బెళగల్, జూలై 24: ఆస్తి తగాదాలతో అవతలి వాళ్లను హత మార్చాలని తాగునీటి కుళాయిలో పురుగుల మందు కలిపారు. ఈ ఆరోపణపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన అంజనేయులకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య చిన్నక్క, రెండో భార్య మద్దమ్మ. వీరి మధ్య ఆస్తి పంపకాల్లో కొద్ది రోజులుగా తగాదాలు ఉన్నాయి. చిన్నక్క ఇంటి నుంచి మద్దమ్మ ఇంటి వైపు తాగునీటి కుళాయి వెళుతుంది. మద్దమ్మ కుటుంబాన్ని అంతం చేయాలని ఆలోచనతో చిన్నక్క కొడుకులు సుంకన్న, శేఖర్ బుధవారం తాగునీటిలో పురుగుల మందు కలిపి వదిలారు. కుళాయి నీటిలో నురగ రావడం, వాసన వేయడంతో అనుమానం వచ్చి మద్దమ్మ ఎస్ఐకి తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేసింది. కేసు విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పని చేయని సర్వర్

» ఓపీ కోసం పడిగాపులు
» వారం రోజులుగా ఇదే పరిస్థితి

కర్నూలు (హాస్పిటల్), జూలై 24: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ కోసం వచ్చే రోగులకు అధికారులు నరకం చూపిస్తున్నారు. గత వారం రోజులుగా సర్వర్ పని చేయక.. వెబ్‌సైట్ సమస్యతో ఓపీ చీటి లేక వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ పని చేయకపోవడంతో బుధవారం ఉదయం సమస్యల వల్ల రోగులు గంటల తరబడి నిరీక్షిస్తూ క్యూలైన్‌లోనే నిలిచి వున్నారు. ఓ పక్క ఆసుపత్రిలో తనిఖీలో కలెక్టర్ రోగుల రద్దీని తగ్గించాలని ఓపీ కౌంటర్ల దగ్గర సమస్యలు లేకుండా చేయాలని ఆదేశించిన ఆసుపత్రి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గత కొద్ది రోజులుగా ఢిల్లీ నుంచి ఈ-హాస్పిటల్‌కు సంబధించిన సర్వర్ మొరాయిస్తోంది. వెబ్‌సైట్ సమస్య వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్పిటల్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. ఢిల్లీ నుంచి వైద్యఆరోగ్య శాఖ సర్వర్ మార్పు చేస్తుందని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. ఉదయం 12 గంటలైనా బుధవరం ఓపీ కోసం రోగులు క్యూలైన్లలో నిలబడ్డారు. సర్వర్ మొరాయింపు వల్ల గర్భిణులు క్యూలైన్లలో నిరీక్షించలేక కింద పడిపోయారు. క్యూలైన్ల భారీగా ఉండటంతో చాలా మంది గర్భిణులు వెనుదిరిగారు. కలెక్టర్ స్పందించి ఈ-హాస్పిటల్‌కు సంబంధించిన సర్వర్ వెబ్‌సైట్ సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.



స్త్రీల ఓపీ దగ్గర బారులు తీరిన రోగులు

పెద్దాసుపత్రికి ఎన్‌ఆర్‌ఐ వైద్యుడి చేయూత

4 ఏసీలను విరాళంగా ఇచ్చిన ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ అనుపమ


అనుపమ విరాళంగా ఇచ్చిన ఏసీలతో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూలై 24: కర్నూలు పెద్దాసుపత్రికి 1988 బ్యాచ్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ అనుపమ వూడర్ల తన తల్లి పసల రెడ్డెమ్మ జ్ఞాపకార్థం కొత్త ఏఎంసీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు రూ.3 లక్షల విలువ గల నాలుగు ఏసీలను విరాళంగా అందించారు. అలాగే ఈ నెల 22న న్యూఆర్‌ఐసీయూ యూనిట్‌కు 1964 బ్యాచ్‌కు చెందిన ప్రవాస భారతీయ వైద్యుడు డా.రంగారెడ్డి రూ.12 లక్షలు విలువ చేసే 12 మానిటర్లు విరాళంగా అందించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 21వ చిన్న పిల్లల వార్డుకు ఈసీజీ మిషన్‌ను చికాగోకు చెందిన నియోనాటాలజిస్టు డా. రామ్మోహన్ కొప్పర్తి విరాళంగా అందించారన్నారు. ఈ నెల 3వ తేదీన కేఎంసీ 1971 బ్యాచ్‌కు చెందిన ఎన్ ఆర్‌ఐ డా.చామర్తి సుబ్బారావు, ఈసీజీ త్రీ చానల్ మిషన్‌ను అందించినట్లు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి: పీడీ


ఉప్పలపాడులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఓర్వకల్లు, జూలై 24: ఇళ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయాలను సందర్శించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించాలని, మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్, వేస్టాయిల్ చల్లించాలని, అలాగే వాటర్ ట్యాంకులను శుభ్ర పరచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఉపాధి కార్యాలయం ఎదురుగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వరి, ఏపీవో కుమార సాయినాథ్, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'అయ్యంకి సేవలు చిరస్మరణీయం'


అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

కర్నూలు(కల్చరల్), జూలై 24: రాష్ట్రంలో తొలి గ్రంథాలయ స్థాపకుడిగా, గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేసిన నాయకుడిగా అయ్యంకి వెంకట రమణయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీ పెద్దక్క కొనియాడారు. బుధవారం అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పెద్దక్క మాట్లాడుతూ గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను స్థాపించిన అయ్యంకి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరగడానికి ఎంతో కృషి చేశారని అన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కోడుమూరు, జూలై 24: పట్టణంలో బీసీ బాలికల వసతి గృహం లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో ఏఐఎస్‌ఎఫ్ బృందం పర్యటించందని అన్నారు. వసతి గృహం లో బాలికలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే మరుగుదొడ్లు, స్నానపు గదులు కూడా బాలికలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చెప్పారు. నీటి సమస్య కారణంగా విద్యార్థులు బయటికి వెళ్లి కొళాయిలు, బోర్ల వద్ద నుంచి బకెట్ల ద్వారా నీటిని తీసుకొచ్చుకొనే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సిద్ధు, అల్తాఫ్, కిషోర్, బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే చంద్రబాబు ధ్యేయం

కల్లూరు, జూలై 24: రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్ అన్నారు. బుధవారం తన స్వగృహంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నుండి రాష్ట్రాభివృద్ధికి 2024-25 బడ్జెట్‌లో నిధులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి విజయ్‌కుమార్ యాదవ్, ప్రణీత్, సుబ్బు, కరీజ్, హేమంత్ పాల్గొన్నారు. అదేవిధంగా 41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో నంద్యాల తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ మహిళలతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

త్రిసభ్య విచారణ కమిటీ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్), జూలై 24: కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్లు రవితేజ, ఫిరోజ్ ఫిర్యాదులపై త్రిసభ్య విచారణ కమిటీని నియమించినట్లు ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. విచారణ కమిటీలో ఏఆర్ఎంవో వెంకటరమణ, ఏవో శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీ బాయి ఉన్నారన్నారు. విచారణ నేపథ్యంలో ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్లను ఆసుపత్రి ఆవరణలోనికి రానివ్వవద్దని సెక్యూరిటీ ఏజెన్సీ ఎస్‌వోను ఆదేశించినట్లు తెలిపారు.

కేబుల్ నెట్‌వర్క్ ధ్వంసం

కర్నూలు, జూలై 24: కేబుల్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశారని నాగప్పవీధికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తనకు గతంలో 2,000 వరకు కనెక్షన్లు ఉండేవని, నగరానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు తన 1,700 కనెక్షన్లను లాగేసుకున్నాడని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలిపారని, మిగతా 300 కనెక్షన్లను ధ్వంసం చేసి తన ఉపాధిని పోగొట్టాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు న్యాయం చేసి తన కేబుల్ కనెక్షన్లు తిరిగి తనకు ఇప్పించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 24: కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేష్‌పై సర్పంచ్ కుమారుడు శివరాం బుధవారం డీపీవో నాగరాజు నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం శివరాం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి నాగేష్ గ్రామంలోని పారిశుధ్య పనులు చేపట్టం లేదని, విధులకు గైర్హాజరవుతున్నారన్నారు. దీనిపై డీపీవో నాగరాజు నాయుడును వివరణ కోరగా ఆదోని డీఎల్‌పీవోను విచారణ అధికారిగా నియమించామన్నారు. విచారణలో తప్పులు రుజువైతే కలెక్టర్ ఆదేశాల మేరకు కటిన చర్యలు తీసుకుంటామన్నారు.

అబ్రహం లింకన్‌కు నివాళి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 24: సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్రహం లింకన్ అనారోగ్యంతో ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆయన మృతికి డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, జిల్లా అధ్యక్షుడు వీజీ వెంకట్రాముడు, పత్రికా సంపాదకుడు రత్నం ఏసేపు, ఓర్వకల్లు ఎంఈవో ఓంకార్ యాదవ్ అబ్రహం లింకన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 24: చిత్తూరు జిల్లా కుప్పంలో వచ్చే నెల 10, 11 తేదీల్లో జరగనున్న 7వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ పోటీల్లో క్రీడాకారులు రాణించాలని డీఎస్‌డీవో భూపతిరావు అన్నారు. కర్నూలు జిల్లా షూటింగ్ బాల్ ఎంపికలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ షూటింగ్ బాల్ అనే క్రీడ పురాతన క్రీడ అని అన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేసన్ అధ్యక్షుడు రామాంజనేయులు, నాగరాజు, మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి


ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న యువసేన నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 24: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏపీ వాల్మీకి యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీ గరిక పాటి బిందు మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇటీవల చోటు చేసుకుంటున్న అమ్మాయిలపై దాడులు వంటి నియంత్రణపై పాఠశాల, కళాశాల యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్పీని విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, శివకుమార్, శివ పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: మెప్మా రీసోర్స్ పర్సన్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఏపీ మెప్మా ఆర్పీల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం కేకే భవన్‌లో కమిటీ జిల్లా సమావేశం అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో గత 20 ఏళ్లుగా పని చేస్తున్న ఆర్పీలకు కనీస వేతనం చెల్లించలేదన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాల న్నారు. వేతనాలకి పనికి ముడిపెట్టకుండా రూ.10వేల వేతనం చెల్లించాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాక్రిష్ణ, ఎండీ అంజిబాబు, ఎస్.ఉమాదేవి, టీఎల్ఎఫ్ నాయకులు రుద్రమ్మ, షబానా పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి: ఆర్డీవో


గూడూరులో మురుగు కాలువను పరిశీలిస్తున్న ఆర్డీవో

గూడూరు, జూలై 24: గూడూరు నగర పంచాయతీ పరిధిలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శేషిరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం గూడూరులో నగర పంచాయతీ పరిధిలో పర్యటించిన ఆర్డీవో శేషిరెడ్డి, కమిషనర్ దివాకర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ, ఏఈ నరసింహులుతో కలిసి ప్రభుత్వ పాఠశాలలను, హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులను, టాయిలెట్స్‌లను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో ఆదేశించారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు


మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో

సి.బెళగల్, జూలై 24: నకిలీ పురుగుల మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కు మార్ దుకాణ యజమానులకు హెచ్చరించారు. బుధవారం సి.బెళగల్‌లో పురుగుల మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుల మందులు, విత్తనాలు విక్రయించే దుకాణ యజమానులు రైతులకు బిల్లులు తప్పనిసరి ఇవ్వాలని, స్టాక్ రికార్డులలో నమోదు చేయాలని అన్నారు. ఎంఈవోలు సిద్దు, వెంకటేష్ ఉన్నారు

నాటుసారా స్థావరాలపై దాడులు


బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న సెబ్, స్క్వాడ్ పోలీసులు

కోడుమూరు(రూరల్), జూలై 24: కోడుమూరు సెబ్, కర్నూలు స్క్వాడ్ పోలీసుల మూకుమ్మడి దాడిలో నాటుసారా సీజ్ చేశారు. బుధవారం సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలివి. స్టేషన్ పరిధిలోని వెల్దుర్తిలో బైరిపోగు నాగమద్దమ్మ, బోయ లక్ష్మీదేవమ్మ అనే మహిళల నుంచి 10 లీటర్ల నాటుసారా సీజ్ చేసి కేసు నమోదు చేశా మని అన్నారు. అలాగే చిట్యాల-కటారుకొండ దారిలో ఉన్న వంకలో నాటుసారా తయారీ కేంద్రాన్ని గుర్తించి 300 లీటర్ల బెల్లం ఊట, సామ గ్రి ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో స్క్వాడ్ సీఐ నరసనాయుడు సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, వెంకటేష్‌నాయక్, అన్సార్‌బాషా, కర్ల, బషీర్‌బాషా, వెంకటరాముడు, షేక్షావలి పాల్గొన్నారు.

యువతను నిరాశపరచిన బడ్జెట్: డీవైఎఫ్ఐ



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ యువతను నిరాశపరచిందని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ అన్నారు. బుధవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా రైల్వే వేగన్ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వక పోవడంతోపాటు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ రద్దు చేయకపోవడం బాధాకరమని అన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నిధుల కేటాయింపు లేకపోవడం నిరుద్యోగులను తీవ్రంగా నిరాశపరచిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా, అబ్దుల్లా పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజా, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. మహిళా శిశు సంక్షేమానికి 2.5 శాతం కేటాయింపులు మాత్రమే పెరిగాయన్నారు. గ్రామీణ ఉపాధి రంగానికి కేటాయింపులే జరగలేదన్నారు. కార్మిక సం క్షేమ నిధిలో కోత విధించారన్నారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థ ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనడం వల్ల రాష్ట్రానికి ఏమి మేలు జరగలేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, కర్నూలు నుంచి విజయవాడకు నడిపే రైలు గురించి బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేకపోవడం దారుణమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాక్రిష్ణ, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి జే.నాగేశ్వర రావు, నాయకులు సాయిబాబా, ప్రభాకర్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను కేటాయించండి


నగర పాలక సంస్థ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: టిడ్కో ఇళ్ల తాళాలు లబ్ధిదారులకు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేనేజర్ చిన్నరాముడుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబీకులు తమ సొంతింటి కళ నెరవేర్చుకునేందుకు అప్పులు చేసి బ్యాంకుల్లో కట్టారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పేదోడిపై పెరుగుతున్న అప్పుల భారాన్ని తగ్గించేందుకు తక్షణమే టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలని కోరారు కార్యక్రమంలో దానేశ్వరి, మాధవి, మీనాక్షి, లోదియా, వెంకటేశ్వరమ్మ, అయ్యమ్మ పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి


భోజనాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో హేమనళిని

కర్నూలు(హాస్పిటల్), జూలై 24: రోగులు, గర్భిణులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డైట్ ఇన్‌చార్జి, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ హేమనళిని సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె గైనిక్ విభాగం ఎదుట గర్భిణులు, బాలింతలు, రోగుల భోజనాన్ని తనిఖీ చేశారు. పప్పు సాంబరు ఎలా ఉందని, సాంబర్ రసంలా ఉందని నాణ్యత పెంచాలని డైట్ సిబ్బందికి తెలిపారు. గర్భిణులకు చిక్కీలు ఇవ్వడం లేదని, వెంటనే ప్రతి రోజూ సాయంత్రం పూట పంపిణీ చేయాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 24: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-2 నాగప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ మౌర్యాఇన్, ఉడ్‌ల్యాండ్, ఎన్‌ఆర్ పేట ఫీడర్ల పరిధిలో కరెంట్ కోత ఉంటుందన్నారు. మౌర్యాఇన్ హోటల్, భాగ్యనగర్, బంగారుపేట, శ్రీరామ్ థియేటర్, రివర్‌వ్యూ కాలనీ, గౌరీగోపాల్ హాస్పిటల్, సుశీలా నేత్రాలయ, హబీబ్ ముబారక్ నగర్, ఎన్‌ఆర్.పేట, సంకల్‌బాగ్, కొత్తపేట, ఎస్వీ కాంప్లెక్స్, గిప్సన్‌కాలనీ, మున్సిపల్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆదేశాలు అమలు చేయనివారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్), జూలై 24: కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు, ఎక్స్‌పర్ట్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర కార్యదర్శి విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో రోగుల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందని, సీఐటీయూ నాయకత్వంలో అక్రమంగా తొలగించిన కార్మికులు, లైంగిక వేధింపులకు గురైన మహిళా కార్మికులు ఈ నెల 22న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. చాలా మంది నిరుద్యోగులు ఏజెన్సీల వారికి ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు మధ్య దళారీలుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


షూటింగ్ బాల్ క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 24: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ బీ.శంకర్‌శర్మ అన్నారు. బుధవారం స్థానిక సిల్వర్ జూబ్లీ బీఈడీ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన షూటింగ్ బాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో క్రీడాకారులు సమష్టి కృషితో విజయం సాధించవచ్చునని అన్నారు. షూటింగ్ బాల్ క్రీడ ఒలింపిక్ క్రీడల్లో లేకపోయినప్పటికీ జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు పరువు రాముడు పాల్గొన్నారు.

'గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి'


సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేస్తున్న ప్రిన్సిపాల్

సి.బెళగల్, జూలై 24: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ బలరాముడు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ పాత గది శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రిన్సిపాల్ రూముకు పక్కన ఉన్న గదిలోకి గ్రంథాలయాన్ని మార్చారు. ఈసందర్భంగా సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు విజేయుడు, చింతలయ్య, ఉపాధ్యాయులు, పీడీ రాఘవేంద్ర ఆచారి, గ్రంథాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్లుగా నంద్యాల, డోన్

నంద్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. నంద్యాల జిల్లాలోని నంద్యాల, డోన్ రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునికీకరించేందుకు తీర్మానించింది. దీంతో ఈ రెండు స్టేషన్ల రూపు రేఖలు మారిపోనున్నాయి. అమృత్ పథకంలో చోటు దక్కడంతో నంద్యాల, డోన్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను మెరుగు పరచడంతో పాటు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభూతిని అందించేందుకు స్టేషన్లు కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. చిన్న వ్యాపార సమావేశాల కోసం ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు ఏర్పాటు చేయటం, మెరుగైన లైటింగ్ ఏర్పాట్లతో పాటు రోడ్లను వెడల్పు చేయడం, అనవసర నిర్మాణాలను తొలగించడం వంటి పనులను చేపడుతారు. అదేవిధంగా ఎస్కలేటర్లు, ప్రయాణికుల కోసం వేచి ఉండే గదులు, వైఫై ఏర్పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సీసీటీవీ నిఘా వంటివి ఈ స్టేషన్లకు అందుబాటులోనికి రానున్నాయి. అంతేకాకుండా ఈ పథకం కిందకు వచ్చే స్టేషన్ల చుట్టూ పట్టణాన్ని కూడా అభివృద్ధి చేస్తారు. రైల్వే బడ్జెట్‌లో నంద్యాల, డోన్‌కు చోటు దక్కడంతో జిల్లా వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల పార్కులను కాపాడండి



కిసాన్ ఘాట్ వద్ద మాట్లాడుతున్న పుల్లారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: నగరంలోని స్వాతంత్ర్య సమర యోధల పార్కులను కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కమిటీ బృందంతో కలిసి పాతబస్టాండు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా పరిషత్ వద్ద గాంధీ విగ్రహం, ఎన్టీఆర్ కూడలి, సుందరయ్య పార్కు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్మారిక కిసాన్ ఘాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు, ప్రభుత్వం మారి నా..వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల్లో మార్పు రాలేదన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పార్కుల అభివృద్ధిపై అధికారులు వివక్షత చూపుతున్నారని అన్నారు. సుందరయ్య పార్కు గోడలు, కోట్ల కిసాన్ ఘాట్ శిలాఫలకాలు ఎవరు కూలగొట్టారని ఆయన ప్రశ్నించారు. వాటంతట అవే కూలిపోతే ఎందుకు నిర్మించలేదన్నారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ కూడలిలో గత ఐదేళ్ల నుంచి ఒక్క మొక్క కూడా నాటలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కే.శ్రీనివాసులు, సీపీ.వర్మ, మద్దిలేటి, రమణగౌడు, రాజు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవోలు

మద్దికెర, జూలై 24: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు. బుధవారం కస్తూర్బ గాంధీ పాఠశాల పరిసరాలను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

దేవనకొండ, జూలై 24 : విత్తన, ఎరువుల దుకాణాలలో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ అన్నారు. దేవనకొండలోని సత్యసాయి ఏజెన్సీ ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహించారు. దుకాణాలలో రైతులు విక్రయాలు చేసిన్నప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఏవో సురేష్‌బాబు, ఏఈవోలు జయరాం, రంగన్న తదితరులు ఉన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

మద్దికెర, జూలై 24: మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు. బుధవారం మద్దికెర ఒకటో సచివాలయంలో ఈ క్యాంపును పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆధార్ ప్రత్యేక క్యాంపు ద్వారా పాఠశాలలో విద్యార్థులు అంగన్‌వాడీ చిన్నారులు ఆధార్ నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్ ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మద్దికెర, జూలై 24: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థులకు ఎంఈవో రంగస్వామి, ఎంఈవో-2 గోపాల్ పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సవిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కలాశాలలో ఇంటర్ విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్‌లు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ బుధవారం తెలిపారు. మొదటి, రెండవ సంవత్సరం చదివే 240 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఉద్యమానికి సిద్ధం కావాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 24: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ జిల్లా నాయకుడు సురేంద్ర పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో రాష్ట్రంలోని 3,4,5 తరగతుల విలీనంతో వేల ప్రాథమిక పాఠశాలలో మూతపడ్డాయన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. క్రమబద్ధీకరణ, హేతుబద్ధీకరణ పేరుతో ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసి ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పజెప్పి మానసికంగా ఇబ్బందులు పెట్టిందన్నారు. 24 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివ, వీరప్రతాప్, శ్రావణి, నిఖిత, ఆది, గోవిందు, వీరేష్, ఉపేంద్ర, మహేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఫొటోలు పెట్టాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హొళగుంద, జూలై 24: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఫొటో పెట్టాలని టీడీపీ మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ, బీజే పొంపాపతి, దుబ్బ ఎర్రిస్వామి, జాకీర్, దిద్ది వెంకటేష్, బీజేపీ మండల కన్వీనర్ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలించారు.

● ఆధార్ కేంద్రం సేవలు గడుపు పెంచాలని టీడీపీ నాయకులు ఎంపీడీవో ఆజాద్‌ను కోరారు. ఆధార్ కార్డు కోసం గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఆధార్ నమోదు గడువు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గాదిలింగ, సీతయ్య, అమాన్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆర్థిక సహాయం

ఆదోని రూరల్, జూలై 24 : ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన బాలుడు హుసేని 15 రోజుల క్రితం అంగన్‌వాడీ వద్ద విద్యుదాఘాతానికి గురయ్యాడు. కర్నూలు ఆసుపత్రిలో ఆసుపత్రిలో చికిత్స పొందుడుతున్నాడు. బాలుడి వైద్య ఖర్చుల కోసం విద్యుత్ ఉద్యోగులు ఆర్థిక సహాయం చేశారు. బుధవారం విద్యుత్ ఎస్.ఈ ఉమాపతి, ఈఈ రాజేష్, ఏడి పురుషోత్తం, రూరల్ ఎఈ చెన్నయ్యలు ఆసుపత్రికెళ్ళి బాలుడి కుటుంబ సభ్యులకు రూ.60వేలు అందజేశారు.

పశువుల మేత దగ్ధం..

● రూ.2 లక్షల నష్టం

మద్దికెర, జూలై 24: మద్దికెరలోని కురువ వీధిలో నివసిస్తున్న కురువ లక్ష్మన్న, రంగస్వామి గడ్డివాములు అగ్నికి దగ్ధం అయ్యాయి. దీంతో రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. పశువుల మేత కోసం స్థానిక జగనన్న కాలనీ సమీపాన బైలు స్థలంలో గడ్డివాములను నిల్వ చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈలోగా గుంతకల్లు ఫైరింజన్‌కు సిబ్బంది వచ్చారు. అయితే అప్పటికే నష్టం జరిగింది. ప్రభుత్వం తమకు పరిహారం ఇవ్వాలని బాధితులు కోరారు. టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌గౌడు, గడ్డం రామాంజులు, కురువ గోపాల్ రైతులను పరామర్శించారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో



కోసిగిలో డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, జూలై 24: ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ కృషి చేయాలని డీఈవో, కోసిగి మండల స్పెషల్ అధికారి శామ్యూల్ అన్నారు. బుధవారం కోసిగిలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతులతో పాటు విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలు ఏవైనా ఉంటే మాకు తెలియజేయాలని, వంద శాతం పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాదించాలని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని, ఇప్పటి నుంచే విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. అనంతరం కోసిగిలోని సచివాలయం-2, 4 లో రికార్డులను పరిశీలించి అలసత్వం వహిస్తున్న సచివాలయ ఉద్యోగులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ షబానా అజ్మిన్, మండల విద్యాధికారులు మొయినుద్దీన్, నాగేశప్ప తదితరులు ఉన్నారు.

టీచర్ల కొరతను పరిష్కరించండి

కోసిగి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 150కి పైగా టీచర్ల కొరత ఉందని, దీంతో ప్రభుత్వ బడులలో విద్య కుంటు పడుతుందని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తు రెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డిలు డీఈవో శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్ మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, పల్లెపాడు సర్పంచ్ రాజేంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

● మండల కేంద్రంలోని మౌంట్ కార్మెల్ హై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీఈవో శామ్యూల్‌కు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఈరేష్ తెలిపారు. బుధవారం కోసిగిలో పర్యటించిన డీఈవోకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి అందజేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ మౌంట్ కార్మెల్ స్కూల్ యజామాన్యం పూర్తి స్థాయి నివేదికలు అందించాలని ఎంఈవోను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు అంజి, నరసింహులు, ఆనంద్,రాజు, తదితరలు ఉన్నారు.

మార్కెట్‌కు వేలాలు నిర్వహించాలి



డీఎల్‌పీవో కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

పత్తికొండ, జూలై 24: మండలంలోని నలకదొడ్డి గ్రామపంచాయతీ మజారా గ్రామమైన అటికెలగుండు గ్రామంలో నిర్వహించే కూరగాయల మార్కెట్‌కు వేలాలు నిర్వహించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. బుధవారం డీఎల్పీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. గ్రామశివారులో నిర్వహించే మార్కెట్ నుంచి ప్రతి రోజు సుమారు రూ. 3నుంచి 4లక్షలవరకు కూరగాయల విక్రయాలు జరుగుతాయన్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన కూరగాయలను వ్యాపారులు హైదరాబాద్ వంటిప్రాంతాలకు తరలిస్తారన్నారు. వేలాలు నిర్వహిస్తే గ్రామపంచాయతీకి రూ. 30లక్షల దాకా ఆదాయం వస్తుందన్నారు. నాలుగేళ్లుగా ఈమార్కెట్‌నిర్వహణ గ్రామ పంచాయితీ ద్వారా వేలాలు జరపకుండా నిర్వహిస్తూ కొందరు పంచాయతీ ఆదాయాన్ని కాజేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ ఆదాయం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో రాజారెడ్డి, మహానంది, మారుతి, నాగన్న, హరి, అంజి, వెంకట్రాముడు ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించండి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

మంత్రాలయం, జూలై 24: మంత్రాలయం, మాధవరం, కల్లుదేవకుంట, చిలకలడోన, వగరూరు గ్రామాల్లో తాగునీటిని అందించాలని ప్రజాప్రతి నిధులు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గిరిజమ్మ అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో మునెప్ప నిర్వహించారు. తాగునీరు, వైద్యం, విద్య, పరిశుభ్రత, పక్కా ఇళ్లు, వ్యవసాయం, పశువైద్యం, విద్యుత్ వంటి అంశాలపై చర్చించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న అర్‌డబ్ల్యూఎస్ అధికారి వేద స్వరూప పట్టించుకోవడం లేదని మంత్రాలయం టీడీపీ ఎంపీటీసీ మేకల వెంకటేశ్, వగరూరు సర్పంచ్ లింగారెడ్డి, మాధవరం ఎంపీటీసీ కురువ ఈరన్న ఆరోపించారు. కార్యక్రమంలో ఏవో జీర గణేష్, పశువైద్యదికారి అశోక్, మాధవరం ఎంపీటీసీ ఈరన్న, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ గోవిందమ్మ, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంఈవో రాగన్న, పంచాయతీ రాజ్ ఏఈఈ నరసింహులు, ఉపాధి ఈసి శ్రీనివాసులు, మండల వైద్యాధికారి గోవిందమ్మ, ఈవోఆర్‌డీ ప్రభావతి దేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మిబాయి, నాగవేణి, ఎంపీటీసీలు చిన్నన్న, మజ్జిగ నరసమ్మ, కార్యదర్శులు వేణుగోపాల్, ఇస్రత్‌బాషా, మహేష్, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులు

ఆదోని టౌన్, జూలై 24: పట్టణంలోని సచివాలయాలలో ఆధార్ స్పెషల్ కాంపులను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి బుధవారం సాయంత్రం తెలిపారు. ఉన్న ఆధార్ కార్డులలోని తప్పులను సరిచేసుకోవడంతో పాటు, కొత్త ఆధార్ కార్డులను పొందాల్సిన వారికీ ఈనెల 27వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

గ్రామ సేవకుడి మృతి

క్రిష్ణగిరి, జూలై 24: తొగర్చేడు గ్రామానికి చెందిన గ్రామ సేవకుడు వెంకట్రాముడు(62) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గత కొంత కాలంగా వెంకట్రాముడు అనారోగ్యంతో బాధపడుతుండేవారు. వీఆర్వో నారాయణ,గ్రామసేవకులు మద్దయ్య,ప్రసాద్ తదితరలు నివాళర్పించారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



పత్తికొండలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కోసిగి, జూలై 24: చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులకు ఎంతో ముఖ్యమని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని జంపాపురం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు బందే నవాజ్, పీడీ రామచంద్రలు అన్నారు. బుధవారం జడ్పీహెచ్ఎస్‌లో ప్రాంతీయ క్రీడల్లో భాగంగా విద్యార్థులు, విద్యార్థినులతో ఆటల పోటీలు నిర్వహించారు.

పత్తికొండ: క్రీడలు విద్యార్థులలో శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని బాలురహైస్కూల్ హెచ్ఎం మాలతి అన్నారు. శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పత్తికొండ స్టేడియం మైదానంలో విద్యార్థులకు వివిధ క్రీడల్లోపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆగోలరాజేష్, దేవిబాయి, రజియాలు ఉన్నారు.

విద్యార్థినులకు అందని భోజనం



ఎమ్మిగనూరు, జూలై 24: ఎమ్మిగనూరు పట్టణంలోని మైనార్టీకాలనీలో ఉన్న కస్తురిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో సిబ్బంది మధ్య సమన్వయలోపం విద్యార్థినులకు శాపంగా మారింది. గత మూడు నాలుగు రోజులుగా విద్యార్థినులకు సమయానికి అల్పాహారం, భోజనం అందక ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం వెళ్లి విచారించటంతో వెలుగులోకి వచ్చింది. విద్యాలయంలో 6నుంచి 10 తరగతి వరకు దాదాపు 225 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. భోజనం ఉడికి ఉడకని అన్నం విద్యార్థినులు పెడుతుండడంతో తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట మనుషుల మధ్య విభేధాల కారణంగానే ఇష్టానుసారం గా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ సిబ్బంది మధ్య విభేదాలతో సమస్య ఏర్పడడంతోనే సమస్య వచ్చిందని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రెండో రోజుల్లో వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్నయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఎమ్మిగనూరు టౌన్, జూలై 24: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఎమ్మిగనూరులోని స్థానిక మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. 3500పైగా విద్యార్థులకు గాను 60మంది ఉపాధ్యాయులు ఉన్నారని, క్రమబద్ధీకరణ, హేతుబద్ధీకరణ పేరుతో ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసి ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పజెప్పి మానసికంగా ఇబ్బందులు పెట్టిందన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ అధ్యక్షులు సురేష్, ధావీదు,రవి కూమార్,జె ఎల్లప్ప పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ఎమ్మిగనూరు టౌన్,జూలై 24 : స్థానిక దామోదరం సంజీవయ్య నగర్‌లో సంజీవి వీరాంజనేయ స్వామి దేవాలయంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ మధుబాబు,పట్టణ అధ్యక్షులు అమరావతి, అధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పుస్తకాల చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్షప్ప, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ అలివేలు, సురేంద్ర,జేట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కేంద్రం

ఆలూరు, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడాన్ని జనసేన పార్టీ మనస్ఫూర్తిగా స్వాగతిస్తుందని జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ వెంకప్ప పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ఈ అర్థిక సంవత్సరంలో రూ.15వేల కోట్లు కేటాయించడం, రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తి కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని కేంద్రం ప్రకటించడంపై జనసేన పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీమఠం అన్నదానానికి రూ.50 వేల విరాళం

మంత్రాలయం, జూలై 24. మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన విష్ణు కిరణ్ అనేభక్తుడు రూ.50 వేలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. బుధవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానంకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు.విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

విద్యార్థులకు గాయాలు

పత్తికొండ, జూలై 24: పత్తికొండ పట్టణంలోని కోయనగర్‌లోని పాతపేట ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన ముగ్గురి విద్యార్థులకు గాయాలయ్యాయి. బుధవారం ఇంటర్‌వెల్ సమయంలో పాఠశాలలో రెండవతరగతి చదువుతున్న సుధీర్, హేమ, చంద్రకళలు పాఠశాల బయటకు వచ్చారు. వారురోడ్డుపై వెళ్తున్న సమయంలో పక్కనే ఉన్న మారెప్పదేవాలయానికి సంబంధించిన 8అడుగుల ఎత్తున్న గేటుప్రమాదవశాత్తు రోడ్డువైపుకు ఒరికిపోయి విద్యార్థుల వైపుపడింది. ఈప్రమాదంలో విద్యార్థులకు గాయాలు కావడంతో వెంటనే ఉపాధ్యాయులు పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నారని ఎంఈవో 2 రమేష్ తెలిపారు.

దోషులను శిక్షిస్తాం: ఎస్పీ



గుండమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదోని రూరల్, జూలై 24 : ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన దళిత గుండమ్మను హత్యచేసిన దోషులను చట్టం కఠినంగా శిక్షిస్తోందని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. బుధవారం ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డిలతో కలిసి ఎస్పీ నాగనాథనహళ్ళి గ్రామానికెళ్ళి గుండమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ నిందితులను చట్టం కఠినంగా శిక్షిస్తోందని, మీరు అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వీరి వెంట ఎస్.ఐలు శ్రీనివాసులు, ఎర్రిస్వామి, పీరయ్యలు ఉన్నారు.

వసతి గృహాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆలూరు, జూలై 24: సంక్షేమ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు గిరి మూర్తి కోరారు. బుధవారం ఇన్‌చార్జీ ఎంపీడీవో ప్రకాష్ నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆలూరు పట్టణ కేంద్రంలోని అరికెర రోడ్డు ఉన్నటువంటి ఎస్సీ ఎస్టీ బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్, బీసీ బాయ్స్ కళాశాల మేనేజ్‌మెంట్ హాస్టల్, మోడల్ బాలికల హాస్టల్స్, పరిధిలోని పరిసర ప్రాంతాలలో డ్రైనేజ్ కాలువలు, మురుగునీటి కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్, చల్లి డ్రెయిన్లు శుభ్రం చేయించాలన్నారు.. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సర్వేశ్, ఉపేంద్ర పాల్గొన్నారు.

5న రిక్రియేషన్ క్లబ్ జనరల్ బాడీ సమావేశం



మాట్లాడుతున్న క్లబ్ కార్యదర్శి రాఘవరెడ్డి

ఎమ్మిగనూరు, జూలై 24: ఎమ్మిగనూరులోని ఎమ్మిగనూరు రిక్రియోషన్ క్లబ్ జనరల్‌బాడీ సమావేశం ఆగస్టు 5న నిర్వహిస్తున్నట్లు క్లబ్ సెక్రటరీ కేఆర్ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం హెచ్‌బీఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల క్లబ్ ప్రెసిడెంట్ వై దేవేంద్ర గౌడ్ మృతి చెందారన్నారు. దీంతో క్లబ్ సభ్యులు జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరటం జరిగిందన్నారు. ఇందుకు గాను జనరల్‌బాడీ సమావేశాన్ని ఆగస్టు 5న జరిపేందుకు నిర్ణయించటం జరిగిందన్నారు. సభ్యులు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు వై పురుషోత్తం గౌడ్, సోగనూరు భీమిరెడ్డి, మల్లికార్జున గౌడ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సామాన్యులకు ఉపయోగపడని కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న నూర్ అహ్మద్

ఆదోని టౌన్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు ఏ విధంగాను ఉపయోగకరంగా లేదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నూర్ అహ్మద్ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి రూ.15వేల కోట్ల ఆర్థిక సాయం అప్పు రూపంలో ఇస్తున్నారా, లేక గ్రాంట్ రూపంలో అందిస్తున్నారా అన్న విషయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా నాయకుడు తాయన్న పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రిన్సిపాల్, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జోబిఫిలిప్

గోనెగండ్ల, జూలై 24: ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ, ఐక్యత అలవడుతుందని ఎన్‌సీసీ9 ఆంధ్రగర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జోబిఫిలిప్ అన్నారు. బుధవారం గోనెగండ్లలోని మోడల్ స్కూల్‌లో 8, 9వ తరగతి విద్యార్థినులకు ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ షహనాపర్వీన్, ఉపాధ్యాయురాలు పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

గోనెగండ్ల, జూలై 24: గోనెగండ్లలో అంటువ్యాధులు సోకకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్ తెలిపారు. గ్రామంలోని పలు వీధులలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గ్రామంలో తాగునీటిని క్లోరినేషన్ చేసి గ్రామంలోకి వదులుతున్నట్లు వారు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు



తెర్నేకల్‌లో మాట్లాడుతున్న అధికారి

దేవనకొండ, జూలై 24: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయకుడదని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని తెర్నేకల్‌లోని వడ్డేగేరి, పుల్లాపురం రస్తా, ఎస్సీ కాలనీ, బాలికల హస్టల్, తదితర కాలనీలలో పర్యటించారు. గ్రామంలో మురుగు నిల్వలు లేకుండా చుడాలని, దోమల వ్యాప్తిని అరికట్టేలా బైఫెక్స్ మందుని వీధులలో స్ప్రే చేయాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఇద్రుస్‌బాషా, పంచాయతీ కార్యదర్శి రాముడు, వీఆర్వో మునీర్, తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ జిల్లా కార్యదర్శికి సన్మానం



చందూనాయక్‌ను సన్మానిస్తున్న పత్తికొండ పీఈటీలు

పత్తికొండ, జూలై 24: వ్యాయామ ఉపాధ్యాయసంఘం జిల్లా కార్యదర్శి చందునాయక్‌ను బుధవారం పత్తికొండ పీఈటీల సంఘం సన్మానించింది. స్థానిక కేజీఎన్ ఫంక్షన్‌హాల్‌లో సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పీఈటీ సంఘం నాయకులు సంజప్ప, రంగస్వామి, పాండు,వేణు, మధు, ఆనందరావు, రాజేష్, హీరోషోరూం అధినేత రామలింగేశ్వరనాయుడు, శ్రీరామా హాస్పిటల్ ఎండి నీలకంఠలతోపాటు వ్యాయమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి



మాట్లాడుతున్న నాయకులు

తుగ్గలి, జూలై 24: బీసీలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలో ఉండాలని, టీడీపీ బీసీ సెల్ నాయకులు వెంకటస్వామి, యువ నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్ అన్నారు. బుధవారం తుగ్గలిలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలను నట్టేట ముంచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు విడుదల చేసిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకురావడం జరుగుతుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు.

శ్రీశైలం చైర్మన్ పదవిని లింగాయత్‌లకు ఇవ్వాలి

తుగ్గలి, జూలై 24: శ్రీశైలం ట్రస్టు బోర్డు చైర్మన్ పదవిని లింగాయత్‌లకు ఇవ్వాలని వీర శైవ లింగాయత్ రాష్ట్ర నాయకులు కౌశిక్ కుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం లింగాయత్‌లు అందరూ ఎంతో కృషి చేశారని, జిల్లాలో 1.80 లక్షల మంది లింగాయత్‌లు ఉన్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం శ్రీశైలం ట్రస్టు బోర్డు చైర్మన్ పదవి లింగాయత్‌లకు ఇవ్వాలన్నారు.

అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తే కఠిన చర్యలు



కోసిగి సెబ్ స్టేషన్‌లో వాహనాల వేలం పాట నిర్వహిస్తున్న సెబ్ పోలీసులు

కోసిగి, జూలై 24: జిల్లాలో అక్రమంగా కర్ణాటక మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సెబ్ సూపరింటెండెంట్ ఎస్.రవి కుమార్ హెచ్చరించారు. బుధవారం కోసిగి సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహించారు. 12 ద్విచక్రవాహనాలు, ఒక కారును వేలం పాట వేయగా.. 9 ద్విచక్రవాహనాలు, ఒక కారును వేలంపాటాదారులు వేలంలో దక్కించుకున్నారు. మరో మూడు బైకులు ప్రభుత్వం నిర్ణయించిన ధర అధికంగా ఉండటంతో వాటిని వేలంలో పాల్గొనలేదు. వేలం పాట వల్ల రూ.2,56,886 ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబు, సెబ్ సిబ్బంది నాగరాజు ఉన్నారు.

యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించండి : ఏఈ

వెల్దుర్తి, జూలై, 24: విద్యుత్ వినియోగదారులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా ఏపీఎస్‌పీడీసీఎల్ కన్జూమర్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలని విద్యుత్‌శాఖ ఏఈ రాఘవేంద్ర బాబు తెలిపారు. బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బిల్ డెస్క్‌ను క్లిక్ చేసి సర్వీస్ నెంబర్ ఎంటర్ చేస్తే వినియోగదారుల వివరాలు, చెల్లించాల్సిన బిల్లు మొత్తం డిస్‌ప్లే అవుతుందన్నారు. సబ్‌మిట్ బటన్ క్లిక్‌చేసి ఫోన్‌పే, గూగుల్ పే, క్రెడిట్, డెబిట్, నెట్‌బ్యాంకింగ్‌లు ఉపయోగించి బిల్లులు చెల్లించవచ్చన్నారు.

విద్యాలయాలను ఏర్పాటు చేయండి

● మంత్రి లోకేశ్‌ను కోరిన పార్థసారథి



ఆదోని టౌన్, జూలై 24: ఆదోని అసెంబ్లీ పరిధిలో ఐదు ప్రభుత్వ హైస్కూల్స్‌తో పాటు ఒక జూనియర్ కాలేజీను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం అసెంబ్లీ సమావేశాల విరామ సమయంలో కలిసి కోరారు. వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేయడంతో ఆదోనిలో అనేక ఎయిడెడ్ స్కూళ్లు మూతపడడం విచారకరమని, విద్యావ్యవస్థను పటిష్టం చేసే చర్యలు తీసుకోవాలని కోరారు.